

# ప్రణయలేఖ

శ్రీ భాస్కరభట్ల కృష్ణారావు.

మొన్న హైదరాబాదనించి మావూరికెళ్లాను—దాదాపు ఆరు సంవత్సరాల్నించి హైదరాబాదలో స్థిరనివాసం ఏర్పరచుకున్న నాకు మొన్నటినించీ ఆ పట్టణమంటే గిట్టటంలేదు. సంవత్సరాల తరబడి జీవితంలో కించిత్తైనా మార్పులేకుండా గడపటమంటే కడు కష్ట సాధ్యం—ఆరుసంవత్సరాలు చలనం లేకుండా రాతికి మల్లే జీవితాన్ని యెల్లా గడుప గలిగానా అని ఆలోచిస్తే నామట్టుకి నాకే ఆశ్చర్యమేస్తూ వుంటుంది అప్పుడప్పుడు.

గతించిన ఆరుసంవత్సరాల జీవితంలో నేనీ విశాలవిశ్వంలో సాధించిన ఘనకార్య మొక్కటీ లేదు—ఆఁ, జ్ఞాపకమొచ్చింది—కొన్ని పుస్తకాలు మాత్రం చదివా—

కాని లాభం—పుస్తకాలు చదవటం ఘనకార్యమైతేగా చెప్పుకునేందుకు—

నా గత జీవితాన్ని సమీక్ష దృష్టితో చూచుకుంటే నామట్టుకు నాకే సిగ్గేస్తూ వుంటుంది. ఆ జీవితాన్ని మరిచిపోవటం సాత్రమైతే అమూలాగ్రంగా మరిచిపోదామన్నంత ఆ వేదన కలుగుతుంది. అట్లా చేయటం నాకు సాధ్యం కాదని తెలిసి కూడా—

యిల్లాంటి భావనతోనే ఈ ఉత్తరాన్ని ఉపక్రమించా—నానిరాశవాదన (Pessimism) నీ హృదయాన్ని కదిలించి బాధపెట్టితే మాత్రం నన్ను క్షమించు. నా స్వభావాన్ని బాగా తెలుసుకున్న నీకు యింతకంటే యెక్కువ వ్రాయటం భావ్యం కాదు—సరే, క్షమిస్తావు కదూ? క్షమిస్తావన్న ధైర్యమే మిగిలిన ఉత్తరాని పూర్తిచేయడంలో సహాయపడుతో వుంది—

నారాజా! యెంతకాలమని ఈయెడబాటుని సహించడం—దినాలూ, మాసాలు, వత్సరాలూ మన

జీవితాలకి మధ్య ఏర్పడ్డ అఖాతాన్ని వాటికి సాధ్యమైనంతవరకు విశాలపరుస్తూ వున్నాయి. దురదృష్టవశాత్తు మనం యెన్నడన్నా కలుసుకోవడం సంభవించెనా!

వొకరితో వొకరం భిన్నభిన్న పకృతులతో, అభిరుచులతో కలవడమవుతుంది—

మనలోని ఏకత్వాన్ని నశింపజేసి కాల చక్రం మన ప్రవృత్తుల్లో యిప్పటి కప్పుడే భిన్నత్వాన్ని స్థాపిస్తూ వుంది —

యిప్పటికే మన జీవితాలు భిన్న భిన్న మార్గాలవలంబించాయి. యిల్లాంటి పరిస్థితుల్లో యింకా కొన్ని సంవత్సరాల తరువాత తలవని తలంపుగా మనిద్దరం కలుసుకోవడం సంభవిస్తే యెల్లా వుంటుందో ఆలోచించు!

ఎనిమిది సంవత్సరాల క్రితం పౌర్ణమి నాటి చల్లని చంద్రికల్లో మనింటి పక్కతోటలో చివర సారి నిన్ను చూడటం తటస్థించింది. రాత్రి సుమారు పన్నెండు అయివుంటుంది. ఆరాత్రి, ఆచలిలో పన్నెండు దాకా నీవు నాకోసం కనిపెట్టుకుకూర్చున్నావు. నేను యింటిలోని పరిస్థితుల్నిబట్టి ఆరాత్రి నీతో కలుసుకోవడం సంభవించదేమో ననుకున్నా. పరిపరివిధాల ప్రయత్నపడి చివరికి యెట్లానైతేనేమి కొన్ని నిమిషాల వరకు నిన్ను చూడగలిగా—

నారాజా! ఆ 'కొన్ని నిమిషాలు' యెంత వేగంగా గడిచిపోయినవో జ్ఞాపకముంది కదూ?

అబ్బా ఆ అమృతక్షణం—జ్ఞాపకమొస్తే యిప్పటికీ వొళ్ళు జలదరిస్తూవుంటుంది—ఆక్షణిక సుఖస్వప్నాన్నే మళ్ళీమళ్ళీ మన జీవితాల్లో అనుభవించాలని యెన్నోమార్లు కోరుకున్నాం. అల్లాంటి దివ్యక్షణం కోసం యిద్దరం యెనిమిది సంవత్సరాలనించీ దివారాత్రులు ప్రయత్నపడుతోవున్నాం—ఆక్షణం మనం అనుభవించిన ఆనందం మన శరీరపు అంచుల్ని దాటి ఈవిశాలవిశ్వం యొక్క శూన్యంలో లీనమై పోయింది. యిప్పటికీ మనకు ఆ శూన్యంలో ఆనంద రేఖలు కనపడటం ఆ అమృత దక్షణాన్ని మధించడంవల్ల బయట పడ్డ దివ్య తేజస్సు వల్లనే—

ఆ క్షణంలో యిద్దరు హృదయాలు ఏకమై నీ హృదయ వీణ ఆనంద ఆలాపనకి నా హృదయ శ్రుతి వేసింది

అల్లాంటి ఏకత్వం మళ్ళీ సిద్ధించడం ఈ జన్మలో కలలోనివార్త—

రోజుకురోజు మనలోని మృదుమధుర ఏకత్వానికి దూరులమైతే భయానకమైన భిన్నత్వంలో కలుసుకొని ప్రయోజనం—

కొన్ని రోజుల క్రితం నిన్ను కలుసుకోవడమంటే అదో ఆనందంగా వుండేది. అప్పట్లో నా జీవితమంతా కలుసుకోవడానికే ఆవేదన పడుతో వుందానిపించేది. వొకరోజు కాకపోయినా వొకరోజు అయినా నీతో కలుసుకోగలననే ధీమా బొందిలోని ప్రాణాల్ని నిలిపింది. ఈ దివ్య సుఖానుభూతే నాజీవితంలో కూడా వొహా మహత్తరమైన ఆశయముందనిపించింది. ఆ ఆశయం సంపూర్తికోసం వొహా విధమైననూ తన శక్తీ, ఉత్సాహం నా రక్తనాళాల్లో ప్రవేశించి అప్పటి మట్టుకు నా నిర్జీవమైన బతుకుని పారవంతంచేసింది—

యిప్పుడో!

జీవితంలోని ఆశయం అంతరించింది. ఆశయమంతరించటంతో ఈ విశాలవిశ్వంలో నేను సాధించవలసిన ఘనకార్యం దృక్పథంలోంచి తొలగిపోయింది. నిన్ను కలకాలం ధ్యానిస్తూవున్న హృదయం విసిగి చేసేదేమీలేక మౌనంవహించింది. దానితో నిష్ఠా, తపస్సూ సమాధీ అన్నీ అమూలాగ్రంగా నశించినాయి—

శరీరంలోని రక్తమంతా కరడుకట్టి హృదయాన్ని వూపిరి తెమలనీయకండా అలుముకుంది.